సాక్షి
కర్నూలు
శుక్రవారం । 6 । సెప్టెంబర్ । 2024



నీటి విడుదల పెంపు

బనగానపల్లె: గోరుకల్లు రిజర్వాయర్ నుంచి ఎస్సార్బీసీ ప్రధాన కాల్వకు నీటి విడుదలను 1,000 నుంచి 2 వేల క్యూసెక్కులకు పెంచారు. ఆయకట్టు పరిధిలో పంటలు సాగు చేశారు.



ఆర్ఎస్ఐనంటూ హల్‌చల్

శ్రీశైలం: మహబూబ్‌నగర్ జిల్లా పుష్పాపురం వ్యక్తి కుసుమ ప్రశాంత్ తాను ఆర్ఎస్ఐనంటూ ప్రొటోకాల్ ఇవ్వాలని శ్రీశైలంలో హల్‌చల్ చేశాడు. పోలీసులు అతన్ని అరెస్ట్ చేశారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తిమట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,632
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:101.773
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 32,877
అవుట్ ఫ్లో(క్యూసెక్కులు)	:28,960

న్యూస్‌రీల్

అనుబంధ విభాగాల అధ్యక్షులుగా రుద్రగౌడ్, అనిల్




కర్నూలు (టౌన్): వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు గురువారం పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులను ప్రకటించారు. జిల్లాకు రెండు రాష్ట్రస్థాయి పదవులు దక్కాయి. బెస్త సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా తెలుగు అనిల్ కుమార్, వీరశైవ లింగాయత్ సంఘం అధ్యక్షుడిగా వై.రుద్రగౌడ్‌ను నియమించారు. వీరి నియామకాలను ధ్రువీకరిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన రుద్రగౌడ్ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేశారు. తనను రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించిన పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఈసందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు.

విజిలెన్స్ ప్రాంతీయ అధికారి బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న కందుల చౌడేశ్వరి

కర్నూలు: విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కర్నూలు ప్రాంతీయ అధికారిగా నియమితులైన కందుల చౌడేశ్వరి గురువారం బాధ్యతలు చేపట్టారు. వెంకటరమణ కాలనీలో ఉన్న కార్యాలయానికి చేరుకోగానే సీఐలు పూల రామకృష్ణ, సునీల్‌కుమార్‌తో పాటు కార్యాలయ సిబ్బంది ఆమెకు పూలబొకే ఇచ్చి సాదర స్వాగతం పలికారు. ఇక్కడున్న నీలం పూజిత రెండు మాసాల క్రితం హెడ్ క్వార్టర్‌కు బదిలీ కావడంతో గుంతకల్లు రైల్వే విభాగంలో ఎస్పీగా పనిచేస్తున్న చౌడేశ్వరిని విజిలెన్స్‌కు బదిలీ చేసి కర్నూలు ప్రాంతీయ అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ కావడంతో గురువారం ఉదయం ఆమె కార్యాలయానికి చేరుకుని బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కార్యాలయ రికార్డులను పరిశీలించారు.

నేడు బదిలీల కౌన్సెలింగ్

కర్నూలు(సెంట్రల్): గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న వీఆర్వోలు (గ్రేడు-2), సర్వేయర్లకు శుక్రవారం బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. వీఆర్వోలకు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియం, సర్వేయర్లకు జిల్లా సర్వే కార్యాలయంలో కౌన్సెలింగ్ చేపడతారు. ఐదేళ్ల సర్వీసు పూర్తి అయిన వారు, స్పౌజ్ కేసులు, అనారోగ్యం తదితర సమస్యలతో బదిలీలకు దరఖాస్తు చేసుకున్న వారికి ప్రాధాన్యత ప్రకారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.

19 మండలాల్లో తేలికపాటి వర్షాలు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని వివిధ మండలాల్లో తేలికపాటి వర్షాలు కురిశాయి. బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు 19 మండలాల్లో వర్షం కురిసింది. కోడుమూరులో అత్యధికంగా 10.2 మి.మీ., వెల్దుర్తిలో 9.8, కర్నూలు రూరల్‌లో 9.4, ఆస్పరిలో 9.2, గోనెగండ్లలో 9.2 పెద్దకడుబూరులో 8.4, ఓర్వకల్‌లో 8.2 ఆదోనిలో 7.6 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లా మొత్తం మీద సగటున 4.5 మి.మీ వర్షం కురిసింది. సెప్టెంబర్ నెల సాధారణ వర్షపాతం 116.5 మి.మీ ఉండగా మొదటి 5 రోజుల్లో 35.5 మి.మీ వర్షపాతం నమోదైంది.

రెవెన్యూ అధికారులపై కేసు నమోదు

కౌతాళం: తప్పుడు కులధ్రువీకరణ పత్రం మంజూరు చేసిన కౌతాళం రెవెన్యూ అధికారులపై గురువారం కేసు నమోదు చేసినట్లు కౌతాళం ఎస్ఐ మహమ్మద్ రిజ్వాన్ విలేకరులకు తెలిపారు. నల్లగోడి శ్రీనివాసులు అనే వ్యక్తి బదినేహాల్ గ్రామంలో ఉంటున్నట్లు తప్పుడు ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రం తీసుకున్నారని, విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు దానిని స్వాధీనం చేసుకున్నారని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సభ్యుడు ఎరుకుల రాజు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై విచారించి తగు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా కౌతాళం పోలీసులకు ఆదేశించారన్నారు. తప్పుడు కుల ధ్రువీకరణ పత్రం పొందిన శ్రీనివాసులుతోపాటు వీఆర్ఓ సూర్యనారాయణ, ఆర్ఐ రాజశేఖర్‌గౌడ్, డిప్యూటీ తహసీల్దారు వీరభద్రగౌడ్, తహసీల్దారు మల్లికార్జునస్వామిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కూటమిలో కలహాల కుంపటి

మూన్నెల్లకే రోడ్డెక్కిన విభేదాలు

- మంత్రులు టీజీ భరత్, ఫరూక్ మధ్య చిచ్చు రేపిన మదర్‌సా
- కమిటీని రద్దు చేసి కొత్త కమిటీకి సిఫార్సు చేసిన మంత్రి ఫరూక్
- పాత కమిటీ పునరుద్ధరించాలని మంత్రి టీజీ భరత్ పట్టు.. ఎమ్మెల్యే కోట్ల మద్దతు
- ఆదోనిలో ఎమ్మెల్యే పార్థసారథి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు మధ్య విభేదాలు
- అధిష్టానం పంచాయితీ చేసినా నందికొట్కూరులో కలవని ఎంపీ, ఎమ్మెల్యే

అధికారం చేపట్టిన మూన్నెల్లకే కూటమిలో కలహాల కుంపట్లు రగిలాయి. మంత్రుల మధ్య అభిప్రాయ భేదాలు పొడచూపితే ఎమ్మెల్యే, ఎంపీలు విభేదాలతో రోడ్డుకెక్కారు. దీంతో మూడు పార్టీల ప్రయాణం మూన్నెల్లు గడువకనే ఇలా ఉంటే.. ఐదేళ్లు ఎలా ప్రయాణం చేస్తారోననే చర్చ టీడీపీ శ్రేణులతో పాటు రాజకీయ పార్టీలలో నడుస్తోంది. కొందరు ఆదాయం కోసం, ఇంకొందరు ఆధిపత్యం కోసం 'నువ్వా–నేనా' అనేలా ప్రవర్తిస్తున్నారు. ఈ వైఖరి కూటమి శ్రేణులతో పాటు అధికారులకు తలనొప్పిగా మారింది. ఈ నెలలో నామినేటెడ్ పోస్టుల భర్తీ జరగనుండటంతో మూడుపార్టీల మధ్య విభేదాలు తారస్థాయికి చేరే అవకాశం ఉందనే చర్చ కొనసాగుతోంది.



టీజీ భరత్



ఎస్ఎండీ ఫరూక్

సాక్షి ప్రతినిధి కర్నూలు: మంత్రులు టీజీ భరత్, ఎస్ఎండీ ఫరూక్ మధ్య కర్నూలులో ఓ మదర్‌సా వ్యవహారం చిచ్చు రేపింది. పాత కమిటీని రద్దు చేసి కొత్త కమిటీని ఓ మంత్రి సిఫార్సు చేస్తే, తిరిగి పాత కమిటీనే కొనసాగించాలని మరో మంత్రి పట్టుబట్టారు. మైనార్టీ శాఖ మంత్రిగా ఫరూక్, తన నియోజకవర్గంలోని వ్యవహారం కావడంతో భరత్ ఎవరికి వారు పట్టు వదలని పరిస్థితి. కర్నూలులో 'అంజుమన్ ఈ షంషియా మదర్ సా' జిల్లాలో ప్రముఖమైంది. కర్నూలు తొలి మునిసిపల్ చైర్మన్ సలాంఖాన్ దీన్ని నిర్మించి, నిర్వహణ కోసం తమ కుటుంబ ఆస్తులు రాసిచ్చారు. కుటుంబ సభ్యులో ఒకరు అధ్యక్షుడిగా కొనసాగుతూ, తనకు నచ్చిన వ్యక్తులను కమిటీలో నియమించుకునే వెసులుబాటు కల్పించారు. ఆరు దశాబ్దాలకుపైగా ఈ మదర్‌సా కమిటీ కొనసాగుతోంది. ఏ ప్రభుత్వం వచ్చినా అందులో జోక్యం చేసుకోకుండా రెండేళ్లకోసారి రెన్యూవల్ చేస్తూ వచ్చారు. గత జనవరిలో కమిటీ గడువు ముగిసింది. రెన్యువల్ చేసేందుకు వక్ఫ్‌బోర్డు కమిటీ లేదు. వక్ఫ్‌బోర్డు కమిటీ చర్చించి, రెన్యూవల్‌పై నిర్ణయం తీసుకోవాలి. ఈ క్రమంలో ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో వక్ఫ్‌కమిటీ ఏర్పాటు జరగలేదు. దీంతో పాత కమిటీని రద్దు చేసి కొత్త కమిటీని వక్ఫ్‌బోర్డు సీఈఓ నియమించారు. ఈ నియామకం మంత్రి ఫరూక్ సిఫార్సుతోనే జరిగిందని పాత కమిటీ అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారం మంత్రి టీజీ భరత్ దృష్టికి వెళ్లింది. తన నియోజకవర్గంలోని వ్యవహారంలో జోక్యం వద్దని పాత కమిటీనే పునరుద్ధరించాలని ఫరూక్‌కు భరత్ చెప్పినట్లు చర్చ జరుగుతోంది. భరత్‌తో పాటు సీనియర్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి కూడా పాత కమిటీనే కొనసాగించాలని చెప్పినట్లు సమాచారం. అయితే భరత్, కోట్ల మాటలు ఖాతరు చేయకుండా ఫరూక్ కొత్త కమిటీ సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది. తాను సుదీర్ఘకాలం ఎంపీగా కొనసాగడంతో కర్నూలు నగరంలోని మైనార్టీలతో ఉన్న సంబంధాలతో కోట్ల, తాను మంత్రిగా ఉండి సొంత నియోజకవర్గంలో ఒక కమిటీని నియమించుకోలేకపోతే మైనార్టీల్లో బలహీనమవుతాననే భావనలో భరత్ ఇద్దరూ వక్ఫ్‌బోర్డు నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించినట్లు తెలుస్తోంది. అయితే వక్ఫ్‌బోర్డు మైనార్టీ సంక్షేమశాఖ పరిధిలోకి రావడంతో మంత్రికి తెలియకుండా తానేం చేయలేనని భరత్‌కు సీఈఓ స్పష్టం చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారం ఇలా ఉంటే వక్ఫ్‌బోర్డు తీర్మానం లేకుండా కమిటీని రద్దు చేసి కొత్త కమిటీని నియమించే అధికారం సీఈఓకు లేదని పాత కమిటీ హైకోర్టును ఆశ్రయించింది.

ఆదోనిలో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే మధ్య వార్

కూటమి పొత్తులో భాగంగా ఆదోని నుంచి బీజేపీ ఎమ్మెల్యేగా పార్థసారథి గెలుపొందారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇక్కడ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేకు అన్ని విషయాల్లో 60:40 నిష్పత్తిలో పంచుకునేలా ఒప్పందం జరిగినట్లు తెలుస్తోంది. మధ్యాహ్న భోజన పథకం, రేషన్ డీలర్లతో పాటు పలు నియామకాలకు సంబంధించి మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు సిఫార్సు లేఖలు ఇచ్చారు. అయితే ఆయన సిఫార్సులు పరిగణలోకి తీసుకోవద్దని అధికారులకు ఎమ్మెల్యే చెప్పినట్లు తెలిసింది. దీంతో టీడీపీ శ్రేణులు మీనాక్షినాయుడు వద్దకు వెళ్లి 'మనం కష్టపడి పని చేస్తే, పార్థసారథి పెత్తనం ఏంటి? అసలు టీడీపీ లేకపోతే బీజేపీ ఇక్కడ గెలిచేదా? మన పనులకు ఎమ్మెల్యే అడ్డుపడటం ఏంటి?' అని వాపోయినట్లు చర్చ జరుగుతోంది. దీంతో ఎమ్మెల్యేపై మీనాక్షినాయుడు బహిరంగంగానే ఆరోపణలు చేశారు. 'ఎన్నికలకు ముందు చెప్పింది ఒకటి, గెలిపించాక పార్థసారథి చేస్తోంది మరొకటి. మేం గెలిపిస్తే మాకే అడ్డుపడతారా?' అని విమర్శించారు. దీనిపై పార్థసారథి కూడా దీటుగానే స్పందించారు. 'బెదిరింపులకో, డైలాగులకు భయపడేది లేదని, ప్రతీ అంశాన్ని వివాదం చేస్తే ఊరుకునేది లేదు. ఇలాంటివి చాలా చూశా!' అంటూ మీనాక్షిని చాలా తేలిగ్గా తీసుకున్నట్లు మాట్లాడారు. అప్పటి నుంచి ఇరువురి మధ్య మాటలు కూడా లేవు. ఇటీవల గర్ల్ హైస్కూలులో ఓ కార్యక్రమానికి ఇద్దరు హాజరైనా మాట్లాడుకోలేదు. దీంతో ఆదోనిలో బీజేపీ, టీడీపీ రెండుగా విడిపోయాయి.

నందికొట్కూరులో తెగని పంచాయితీ

నందికొట్కూరులో ఎమ్మెల్యే జయసూర్య, ఎంపీ బైరెడ్డి శబరి మధ్య విభేదాలు అధిష్టానం జోక్యం చేసుకున్నా సమసిపోలేదు. సీఐ సుధాకర్ రెడ్డి నియామకంలో ఇద్దరి మధ్య తలెత్తిన విభేదాలు తారస్థాయికి చేరాయి. ఎంపీతో పాటు ఆమె తండ్రి బైరెడ్డి రాజశేఖరరెడ్డిపై జయసూర్య తీవ్రంగా విమర్శలు చేశారు. అయితే బైరెడ్డి.. జయసూర్యను తేలిగ్గా తీసుకున్నారు. 'ఇలాంటి వారిని చాలా మందిని చూశా' అని తన అనుచరులతో ఎమ్మెల్యే వ్యవహారాన్ని కొట్టిపారేసినట్లు తెలుస్తోంది. ప్రతీ వ్యవహారంలో ఇద్దరూ సిఫార్సులు చేయడంతో అధికారులకు తలనొప్పిగా మారింది. దీంతో ఈ నియోజకవర్గంలో ఏ నిర్ణయం తీసుకోవాలన్నా అధికారులు స్వేచ్ఛగా వ్యవహరించలేకపోతున్నారు.



సిఫారసులతో తలనొప్పి

తాజాగా నందికొట్కూరులో షాదీఖానా విషయంలో ఎమ్మెల్యే ఓ కమిటీని సిఫార్సు చేస్తూ మైనార్టీ సంక్షేమశాఖ అధికారికి లేఖ రాశారు. ఇది తెలిసి ఎంపీ శబరి మరో కమిటీని సిఫార్సు చేస్తూ కలెక్టర్‌కు లేఖ రాశారు. అయితే ఎమ్మెల్యే సిఫార్సు చేసిన కమిటీనే అధికారులు నియమించారు. దీనిపై శబరి కూడా అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. దీంతో ఎమ్మెల్యే, ఎంపీ ఇద్దరూ కలిసి ఏకాభిప్రాయానికి వచ్చి నిర్ణయాలు తీసుకోవాలని, అలా కాకుండా ఇద్దరూ వేర్వేరుగా సిఫార్సు చేస్తే, ఇద్దరి సిఫార్సులను పక్కన పెట్టి తాము నిర్ణయం తీసుకుంటామని పలువురు అధికారులు చెప్పినట్లు సమాచారం.

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా ఎస్వీ మోహన్‌రెడ్డి



కర్నూలు (టౌన్): వైఎస్సార్‌సీపీ నూతన జిల్లా అధ్యక్షుడిగా కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డిని గురువారం పార్టీ అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. తనపై జగనన్న ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా తన పేరును ప్రతిపాదించిన నాయకులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. అందరినీ కలుపుకొని పార్టీని మరింత బలోపేతం చేస్తానన్నారు. కార్యకర్తలకు 24 గంటలు అందుబాటులో ఉంటానన్నారు. కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఎప్పటికప్పుడు ప్రశ్నించేందుకు వెనుకాడబోనన్నారు. పార్టీలో ఎవరికి ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు ముందుంటానన్నారు. జిల్లాలో పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు నిరంతరం కృషి చేస్తానన్నారు.

ఈ కష్టం తీర'నిధి'

- ఏపీజీఎల్ఐ సేవలు అస్తవ్యస్తం
- నిధి పోర్టల్‌లో అప్‌లోడ్ కాని క్లెయిమ్‌లు
- లోన్ దరఖాస్తులన్నీ పెండింగ్‌లోనే
- పరిష్కరించని కూటమి ప్రభుత్వం



కర్నూలులోని ఏపీజీఎల్ఐ కార్యాలయం

కర్నూలు(అగ్రికల్చర్): ప్రభుత్వ ఉద్యోగులకు సామాజిక భద్రత, సంక్షేమం అందించాల్సిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జీవిత బీమా (ఏపీజీఎల్ఐ) కార్యాలయం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోంది. ఎలాంటి క్లెయిమ్‌లు పరిష్కారం కాకపోవడంతో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్థిక శాఖ నియంత్రణలో ఏపీజీఎల్ఐకి కర్నూలులో కార్యాలయం ఏర్పాటు చేశారు. ఇక్కడ జాయింట్ డైరెక్టర్ స్థాయి అధికారి ఉన్నారు. ఈయన గుంటూరు, విజయవాడ ఏపీజీఎల్ఐ కార్యాలయాల్లో ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దీంతో కర్నూలుకు ఎప్పుడు వస్తారో... ఎన్ని గంటలు ఉంటారో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 2,500 మంది వివిధ సమస్యలు ఎదుర్కొంటున్నారు. కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం వీరి సమస్యల పరిష్కారానికి చొరవ చూపడం లేదు.

ఇవీ సమస్యలు..

రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు ప్రతినెలా తమ మూలవేతనం నుంచి రాష్ట్ర ప్రభుత్వ జీవిత బీమాకు కొంత ప్రీమియం చెల్లిస్తారు. పదవీవిరమణ సమయంలో ఈ క్లెయిములు పరిష్కరిస్తారు. ఈ నిధి నుంచి కొందరు వ్యక్తిగత అవసరాల కోసం రుణాలు తీసుకోవచ్చు. అయితే క్లెయిమ్‌లు, రుణాల కోసం చేసుకున్న దరఖాస్తులు పట్టించుకునే వారు కరువయ్యారు.

- 2023 ఆగస్టు నుంచి ఏపీజీఎల్ఐలోని అన్ని రకాల సేవలను నిధి పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లోనే చేపట్టాల్సి ఉంది. అయితే అంతకు ముందే మాన్యువల్‌గా డెత్, రిటైర్‌మెంట్ క్లెయిమ్‌లతో పాటు లోన్ దరఖాస్తులు భారీగా వచ్చాయి. నెలవారీగా ప్రీమియం చెల్లించిన ఉద్యోగులు బాండ్ల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. అయితే వాటిని ఎవ్వరూ పట్టించుకోలేదు. వాటిని నిధి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయలేదు.
- నిధి పోర్టల్ వచ్చిన తర్వాత క్లెయిమ్‌లు, ఇతర దరఖాస్తులు వెనక్కి ఇచ్చి అప్‌లోడ్ చేయాలని ఉద్యోగులకు సూచించలేదు. సిబ్బంది లేరని, దగ్గరున్న డాక్యుమెంట్లతో సమస్యలు పరిష్కరించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అయితే మాన్యువల్ దరఖాస్తులు వెనక్కి ఇవ్వకపోవడం, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయకపోవడంతో ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- నిధి పోర్టల్ ద్వారా వచ్చిన క్లెయిమ్‌లు, దరఖాస్తులకు కూడా మోక్షం లభించడం లేదు. సీనియారిటీ ప్రకారం పరిష్కరిస్తాం అంటూనే మామూళ్లు తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.
- ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు నెలవారీగా చెల్లించిన ప్రీమియంకు సంబంధించి బాండ్ల కోసం డీడీవోల ద్వారా ప్రతిపాదనలు పంపుతున్నారు. వీటిని ఏపీజీఎల్ఐ కార్యాలయంలో పట్టించుకునే వారు లేరు. కొన్ని బాండ్లు ఇచ్చినా వాటిలో తప్పులు దొర్లుతున్నాయి. వీటిని సవరించే వారు కూడా లేరు. నిధి పోర్టల్‌లో సమస్య పరిష్కారం అవుతుందని సూచిస్తున్నా.. అక్కడా కావడం లేదు.

అన్నీ సమస్యలే

కర్నూలు ఏపీజీఎల్ఐ కార్యాలయంలో అన్నీ సమస్యలే ఉన్నాయి. డెత్, రిటైర్‌మెంటు, లోన్ దరఖాస్తులన్నీ పెండింగ్‌లో ఉండిపోయాయి. ఇక్కడ అధికారులు పట్టించుకోలేదు. సిబ్బంది లేరనే కారణాన్ని చూపుతున్నారు. కూటమి ప్రభుత్వం చొరువ తీసుకొని ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాల్సి ఉంది.

– జీ.సుధాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి, యూటీఎఫ్



అవార్డులు పొందిన ఉపాధ్యాయులతో కలెక్టర్ రంజిత్‌బాషా, ఎంపీ నాగరాజు, ఎమ్మెల్సీ రామ్‌గోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి తదితరులు

సమాజ నిర్దేశకులు గురువులు

- టెక్నాలజీని అందిపుచ్చుకొని బోధన చేయాలి
- గురుపూజోత్సవంలో జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా
- ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానం




హాజరైన ఉపాధ్యాయులు

కర్నూలు(సెంట్రల్): సమాజ నిర్దేశకులు గురువులేనని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని గురువారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో గురుపూజోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్‌తోపాటు ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి హాజరయ్యారు. ముందుగా అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు రోజులో మూడోవంతు సమయాన్ని విద్యార్థులతో గడుపుతారని, ఆ సమయంలో వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. టెక్నాలజీని అందిపుచ్చుకొని బోధన చేయాలని సూచించారు. బోధనలో మంచి నైపుణ్యం ఉన్న ఉపాధ్యాయుల వీడియోలు తీయించి విద్యార్థులకు చూపించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం 35 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారని, అందులో 23 మందిని ఎంపిక చేసినట్లు చెప్పారు. వచ్చే సంవత్సరం ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు రావాలని కోరారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ.. తాను కాంట్రాక్ట్ లెక్చరర్‌గా పని చేశానని, సర్వేపల్లి రాధాకృష్ణన్ స్ఫూర్తితో ఎంపీగా ఎదిగానన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఎమ్మెల్సీ రామ్‌గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. జీఓ 117 సవరణపై ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుంటుందన్నారు. ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులను ఉత్తమ పౌరువులుగా తీర్చి దిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు ప్రదానం చేశారు. అంతకుముందు శారదా సంగీత కళాశాల విద్యార్థునుల నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో డీఈఓ శామ్యూల్, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హాయ్.. వచ్చేస్తున్నా!

- విఘ్నేశ్వరుడి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు
- గణేశ్ విగ్రహాల ఏర్పాటుకు 1,130 దరఖాస్తులు
- వాట్సాప్‌లో 'హాయ్' సందేశం పంపితే అనుమతి
- ఇప్పటి వరకు 700 విగ్రహాల వరకు నిరభ్యంతర పత్రాల జారీ



కర్నూలు: గణేశ్ నవరాత్రుల నిర్వహణకు ఊరూవాడా సిద్ధమవుతున్నాయి. వినాయక చవితిని పురస్కరించుకుని బొజ్జ గణపయ్యలను ప్రతిష్టించి ఉత్సవాలు నిర్వహించేందుకు ఆయా కమిటీలు పోలీసు శాఖ అనుమతి కోసం ఆన్‌లైన్‌లో పెద్ద ఎత్తున దరఖాస్తు చేస్తున్నారు. గురువారం మధ్యాహ్నం వరకు 1,130 దరఖాస్తులు రాగా 700కు పైగా విగ్రహాల ప్రతిష్టకు పోలీసు శాఖ అనుమతులిచ్చింది (నిరభ్యంతర పత్రాలు). అనుమతి పొందిన ప్రాంతాల్లో నిర్వాహకులు మండపాలను ముస్తాబు చేస్తున్నారు. పందిళ్లు ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. కొందరు భారీ విగ్రహాలను కొనుగోలు చేసి కొలువుదీరుస్తుండగా మరికొందరు పర్యావరణ హితాన్ని దృష్టిలో ఉంచుకుని మట్టి గణపతులు ప్రతిష్టించి పూజించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇంటి నుంచే అనుమతులు...

ఈ ఏడాది ఇంటి నుంచే ఆన్‌లైన్‌లో అనుమతులు ఇచ్చేలా ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించి దరఖాస్తు చేసుకున్న వెంటనే వినాయక మండపాలకు నిబంధనలతో కూడిన 'క్యూఆర్ కోడ్'తో అనుమతులిస్తున్నారు. గతంలో అన్ని శాఖల అధికారులను సంప్రదించి అనుమతులు తీసుకోవాల్సి వచ్చేది. ఆ పద్ధతికి స్వస్తి చెప్పి ఆన్‌లైన్‌లో అనుమతిస్తున్నారు. మండపాలు పెట్టేవారు కచ్చితంగా ఉత్సవ కమిటీని నియమించుకోవాలి. వారిలో ఎవరో ఒకరు సెల్ ఫోన్ నుంచి 7995095800 నంబర్‌కు వాట్సాప్‌లో 'హాయ్' సందేశం పంపించాలి. వెంటనే సదరు నంబర్‌కు అనుమతి ప్రక్రియలో భాగంగా లింక్ వస్తుంది. దానిని అనుసరించాలి. అంతా ఆన్‌లైన్‌లో జరుగుతుంది. వచ్చిన దరఖాస్తులన్నిటినీ పరిశీలించి విగ్రహాలకు క్యూ ఆర్ కోడ్‌లు ఇస్తున్నట్లు ఒక పోలీసు అధికారి తెలిపారు. ఇప్పటివరకు 1,130 దరఖాస్తులు రాగా 700 వరకు నిరభ్యంతర పత్రాలు జారీ చేసినట్లు ఆయన వెల్లడించారు. విగ్రహాలు ఏర్పాటు చేసే మండపం వద్ద క్యూఆర్ కోడ్‌ను అతికించాలి. పోలీసులు తనిఖీల్లో భాగంగా ఆ కోడ్‌ను స్కాన్ చేస్తే విగ్రహానికి సంబంధించిన అన్ని వివరాలు వెల్లడవుతాయి.